


(గత సంచిక తరువాయి)

"**ఇందుకు ప్రధాన దోషి** రెఫ్రిజరేషన్. రెఫ్రిజరేషన్ సౌకర్యంలేని కాలంలో ఇంత దీర్ఘకాలం శవాన్ని అట్టేపెట్టేవారు కారు. మార్చురీ అందుబాటులోకి రాకమునుపు రెండు మూడు రోజుల్లో ఖననం జరిగిపోయేది. ఇప్పుడు అందుకు సగటున మూడు నించి ఆరునెలలు పడుతోంది. ఘనానియన్ ఫ్యూనరల్లోని జాప్యానికి రెఫ్రిజరేషన్‌ని నిందిస్తాను. మరణించినతని ఇంటిని పునాదులనించి పడగొట్టి మళ్ళీ కొత్త ఇంటిని నిర్మించే సంప్రదాయం కూడా వీరిలో ఉంది" అలెక్సీ చెప్పాడు.

"ఓ! ఇది నాకు తెలీక సైమన్ చెపితే నమ్మలేకపోయాను. లిక్విడ్ గోల్డ్ ప్లీజ్" చైత్ర చెప్పింది.

అలెక్సీ లేచెళ్ళి చిన్న అంగుళంన్నర పొడవైన సన్నటి గాజు సీసాని తెచ్చి ఆద్యకి ఇచ్చాడు. అందులో నల్లటి ద్రవం ఉంది.

"ఇదో అపూర్వమైంది. ఇదేమిటో కనుక్కోగలవా?" అడిగాడు.

"వాసన చూడచ్చు" ఇలియా నవ్వుతూ సూచించింది.

"పెట్రోల్. కాని ఇంత నల్లగా ఉందేమిటి?" ఆద్య దాన్ని వాసన చూసి చెప్పింది.

"అందుకే అపూర్వమైంది అన్నాను. ఇక్కడికి దక్షిణం వైపు నలభై రెండు మైళ్ళ దూరంలోని సౌత్ అట్లాంటిక్ మహా సముద్ర గర్భంలో ఇరవై మూడువేల అడుగుల కిందనించి మొదటగా తీసిన నాలుగు గేలన్లలోది ఇది. ఈ పాతిక ఎం.ఎల్ ఆయిల్ తీయడానికి పది లక్షల డాలర్లు ఖర్చు చేసారు. కాస్మోస్ ఎనర్జీ కంపెనీ ఆయిల్ కోసం అక్కడ తవ్వే కాంట్రాక్ట్‌ని మా కంపెనీకి ఇచ్చారు. మా కంపెనీ పంపిన టీంలో నేనూ ఉన్నాను. ఇక మీదట చమురు బావిలోంచి ఇలాంటి క్రూడ్ ఆయిల్‌ని తోడి తీసి, శుద్ధి చేసి పెట్రోల్ని తీస్తారు."

"దీనికి లిక్విడ్ గోల్డ్ అని ముద్దు పేరు. లక్షల సంవత్సరాలనించి భూమిలో ఉన్న దీన్ని నేను, నువ్వు చూడగలగడం అపూర్వమైన అనుభవమే కదా?" చైత్ర చెల్లెల్ని అడిగింది.

"అవును. థాంక్స్" ఆద్య దానివంక చూస్తూ చెప్పింది.

"హ్యూమన్ చెయిన్ గురించి మా చెల్లెలికి చెప్పండి" చైత్ర ఇలియాని కోరింది.

"లెట్ మీ సర్వ్ టీ" ఇలియా లేచి చెప్తూనే టీని చేసింది.

"నేను పుట్టినప్పుడు సోవియట్ రష్యానే నా స్వదేశం. ఐనా ఇప్పుడు ఎస్తోనియా, పెరిస్త్రోయికా, గ్లాస్‌నాస్త్ జరిగాక విడిపోయిన కొన్ని దేశాల్లో మాదీ ఉంది. సోవియెట్‌నించి బాల్టిక్ దేశాలైన లాత్వియా, ఎస్తోనియా, లిథువేనియా చాలాకాలంగా స్వతంత్రం కోరాయి. రష్యామీద నిరసనగా ఆ మూడు దేశాల పౌరులం మొత్తం ఇరవై లక్షలమంది ప్రపంచం అటెన్షన్‌కోసం 23 ఆగస్ట్ 1989న రాత్రి ఏడునించి ఏడుం పావుదాకా పావుగంటసేపు శాంతియుతంగా చేతులు పట్టుకుని హ్యూమన్ చెయిన్‌గా ఆరువందల తొంభై కిలోమీటర్ల దూరం నిలబడ్డాం."

"ఎన్ని కిలోమీటర్లు?" ఆద్య అడిగింది.

"ఆరువందల తొంభై కిలోమీటర్ల దూరం. అలా నిలబడ్డవారిలో నేనూ ఉన్నాను. చివరికి మా మూడు దేశాలకి అగస్ట్ 1991లో డెమోక్రసీ వచ్చింది" ఇలియా చెప్పింది.

"దాన్ని నేను డెమోక్రసీ అనను. కాకిస్టోక్రసీ అంటాను" అలెక్సీ నవ్వుతూ చెప్పాడు.

"కాకిస్టోక్రసీ? అంటే?" వెంటనే చైత్ర అడిగింది.

"గూగుల్ చేసి నువ్వే నాకు చెప్పు" అతను కోరాడు.

చైత్ర వెంటనే ఆ పని చేసి చెప్పింది.

"ది గవర్న్‌మెంట్ బై ది వరస్ట్ పీపుల్, నేమ్లీ నాట్ కాంపీటెంట్ సిటిజన్స్ ఆఫ్ ఏ స్టేట్."

"ప్రతీ డెమొక్రసీలోని సమస్య ఇదే. సమర్ధులైన నాయకులని ఎన్నుకునే సమర్ధతలేని మెజారిటీనే ఎక్కువ. దాంతో ఏ డెమోక్రటిక్ దేశంలోనైనా నాయకులు ప్రజాసంక్షేమం కోసం ఎన్నిక అవరు. తమ సంక్షేమం కోరుకునే నాయకులే ఎన్నిక అవుతారు."

"అలెక్సీ టిపికల్ కమ్యూనిస్ట్" ఇలియా నవ్వి చెప్పింది.

"రెండున్నర వేల ఏళ్ళ క్రితమే గ్రీక్ ఫిలాసఫర్ ప్లేటో చెప్పాడు. మంచివాళ్ళు దేశంలో జరిగేది పట్టించుకోకపోతే చెడ్డవాళ్ళు పాలిస్తారని. ప్రతీ ప్రజాస్వామ్యదేశంలో దాదాపుగా జరిగేది ఇదే. రైట్ కంట్రీ ఇన్ రాంగ్ హేండ్స్. ఆశ్చర్యంగా ప్రజలు ఆ చెడ్డవారికే ఓట్లు వేసి మళ్ళీ మళ్ళీ గెలిపిస్తున్నారు."

"నిజమేనా? నువ్వు టిపికల్ రష్యన్‌వా? ప్రజాస్వామ్యం ఇష్టంలేదా?" చైత్ర అడిగింది.

"నిజానికి ప్రపంచంలోని సగం సంపద ప్రపంచ జనాభాలోని రెండు శాతం మంది దగ్గరే ఉందని నీకు తెలుసా? నిత్యం ప్రపంచంలో ఇరవై ఒక్క వేల ఆకలి మరణాలు సంభవిస్తున్నాయి. అదే సమయంలో నాలుగు లక్షల డాలర్ల షాంపేన్ విందుల్లో ఖర్చవుతోంది. ప్రజాస్వామ్య దేశాల్లోని ధనికులు పార్టీకి వేసుకువెళ్ళేందుకు బట్టల అల్మార తెరచి చూసి 'కట్టుకోడానికి ఏం లేదు' అంటారు. బీదలు పార్టీకి వెళ్ళరు. ఒకే దుస్తులని వేసుకుని పనికి వెళ్తారు. ఎక్కువ ఉండటం

కూడా లేకపోవడమే. ఛాయిస్ పెరిగేకొద్దీ ఆనందం తగ్గిపోతుంది. ఓ చవక డబుల్ డోర్ కారుంటే దాంట్లో ఆనందంగా వెళ్తారు. అదే పకార్డ్, బిఎండబ్ల్యు కార్లుంటే 'దేంట్లో వెళ్ళాలి?' అని సీరియస్‌గా ఆలోచిస్తారు. కమ్యూనిజంలో ఇలాంటివి జరగవు. నీ గుండెలో విరాళం ఇచ్చే బుద్ధి లేకపోతే నీకు పెద్ద గుండె జబ్బు ఉందని మా నాన్న అనేవారు. ప్రజాస్వామ్యమైన అమెరికా అంతా 'నేను'తో నిండి ఉంటుంది. రష్యా 'మనం'తో కమ్యూనిజానికి, కేపిటలిజానికి తేడా అదే" అలెక్సీ కూడా నవ్వుతూ చెప్పాడు.

"పొలిటికల్ డెఫినిషన్స్ చెప్పు అల్" ఇలియాఅ నవ్వుతూ సూచించింది.

"తప్పకుండా. ఇందుకు ఆవుని ఉదాహరణగా తీసుకుంటాను.

ముందుగా మా రష్యన్ కమ్యూనిజం. నీ దగ్గర రెండు ఆవులు ఉన్నాయి. ఆ రెండూ ప్రభుత్వం తీసుకుంటుంది. నీకు పాలని ఇస్తుంది.

2. చైనీస్ కమ్యూనిజం. నీ దగ్గర రెండు ఆవులు ఉన్నాయి. వాటి పాలని పితకడానికి మూడువందల వర్కర్స్‌ని నియమిస్తారు. ప్రొడక్షన్ ఆరు వందల శాతమని, ఎంప్లాయ్‌మెంట్ పన్నెండు వందల శాతం పెరిగిందని ప్రకటిస్తారు. నిజాన్ని తెలుసుకుని రాసిన జర్నలిస్ట్ అకస్మాత్తుగా మాయమవుతాడు.

3.సోషలిజం.

నీ దగ్గర రెండు ఆవులు ఉన్నాయి. ప్రభుత్వం నీ దగ్గరనించి ఓ ఆవుని తీసుకుని అది నీ పొరుగువాడికి ఇస్తుంది. పాలల్లో కొంత భాగం ప్రభుత్వానికి సుంకంగా చెల్లిస్తావు.

4. ఇండియన్ సోషలిజం. నీ దగ్గర రెండు ఆవులు ఉన్నాయి. వాటిని పూజిస్తారు."

"నిజమే" చైత్ర నవ్వి చెప్పింది.

"5. సంప్రదాయ కేపటలిజం. నీ దగ్గర రెండు ఆవులు ఉన్నాయి. ఒకదాన్ని అమ్మి ఆంబోతుని కొంటావు. నీ ఆవులమంద విస్తరిస్తుంది. వాటన్నిటినీ అమ్మి నలభైయ్యవ ఏటే రిటైరవుతావు.

6. వెంచర్ కేపిటలిజం. నీ దగ్గర రెండు ఆవులున్నాయి. మూడిటిని ఆస్థులుగా చూపించి, కంపెనీని స్థాపించి వాటి షేర్లని అమ్ముతావు."

"మూడు?" ఆద్య అడిగింది.

"అవును. తర్వాత నాలుగు ఆవులని చూపించి బేంక్‌లో లెటర్ ఆఫ్ క్రెడిట్‌ని ఓపెన్ చేస్తావు. ఐదు ఆవులకి నీకు టేక్స్ ఎగ్జెంప్షన్ వస్తుంది. ఆ ఆరు ఆవుల పాలని పితికే హక్కులని అమ్మి ఆ డబ్బుని కేమన్ ఐలాండ్‌లోని డొల్ల కంపెనీకి బదిలీ చేస్తావు. చివరకి రాజకీయాల్లో చేరతావు. చైనాలో, అమెరికాలో బయటపడితే వీరికి శిక్ష తప్పదు. ఇండియాలో

అప్పటికే ముఖ్యమంత్రైన వారిని ఎవరూ ఏం చేయలేరు. ప్రతిపక్షం కేంద్రంలో ఉంటే వారిమీద కేసు పెడుతుంది. వారు మరణించాక వారు దోషులని తీర్పు వస్తుంది. అప్పటికి ప్రజలు వారిని మర్చిపోతారు."

"హౌ ట్రూ!"

"ఇండియన్ డెమోక్రసీ. మీకు రెండు ఆవులు ఉన్నాయి. కాని అవి స్విడ్జర్లేండ్‌లో ఉన్నాయి. స్విడ్జర్లేండ్ డెమోక్రసీ. మీకు ఐదువేల ఆవులు ఉన్నాయి. కాని అవి మీవి కావు. వాటి సంరక్షణకి కొంత రుసుము వసూలు చేస్తావు. వాటి పాలని నువ్వే అనుభవిస్తావు. బ్రిటీష్ కేపటలిజం. నీ దగ్గర రెండు ఆవులు ఉన్నాయి. అవి మేడ్ కౌస్. ఎందుకంటే ఇంకా ఎక్కువ పాలివ్వాలని వాటికి మాంసం పెడతావు. ఐరిష్ కేపిటలిజం. నీ దగ్గర రెండు ఆవులు ఉన్నాయి. అందులో ఒకటి గుర్రం."

ఆద్యకి ఆ చిన్న ఉదాహరణలు తేలిగ్గా అర్ధం అవుతున్నాయి.

"గ్రీక్ కేపటలిజం. నీ దగ్గర రెండు ఆవులు ఉన్నాయి. అవి జర్మన్, ఫ్రెంచ్ బేంక్స్ నించి అప్పు తీసుకున్నవి. ఆ రెంటినీ కోసుకు తింటారు. ఐ.ఎం.ఎఫ్.కి అప్పుకోసం వెళితే రెండు ఆవులు ఇస్తారు. అప్పు చెల్లించమని అడగడానికి వస్తే వాళ్ళని క్షవరశాలకి పంపుతావు. ఇండియాలో బ్రిటీష్ సంప్రదాయ బ్యూరోక్రాటిజం ఉంది. ఆ వ్యవస్థలో నీ దగ్గర రెండు ఆవులు ఉన్నాయి. అధికారులు వాటిలోంచి రెండూ మీ నించి తీసుకుని ఒకటి చంపి తింటారు. రెండోదాన్నించి పాలుపిండి అధికారులు దాన్ని మట్టిలో పోస్తారు.

నియంతృత్వం. నీ దగ్గర రెండు ఆవులు ఉన్నాయి. అవి నీ దగ్గరకాక నీ నియంత ఇంట్లో ఉన్నాయి. అందులోంచి నియంత మీకు సరిపడా పాలని ఇస్తూంటాడు. అందుకు అతన్ని నువ్వు పూజించడానికి నీ ఇంటికి అతని ఫోటోని సరఫరా చేస్తాడు."

"వెల్ ఎక్స్‌ప్లెయిండ్" చైత్ర చెప్పింది.

"నేనో సోవియెట్ రష్యా జోక్ చెప్పనా?" చైత్ర అడిగింది.

"చెప్పు. నాకా డెబ్బై ఆరు జోక్ తెలుసు. అందులో ఇదుందేమో చూస్తాను" అతను నవ్వుతూ చెప్పాడు.

"మాస్కోలో టీచర్ అలెక్సీని అడిగిందట, రష్యా ఎలాంటిదని. రష్యా నా తల్లిలాంటిదని చెప్పాడు. కమ్యూనిస్ట్ పార్టీ అని అడిగితే, తండ్రిలాంటిదని చెప్పాడు. పెద్దయ్యాక ఏమవుతావని టీచర్ అడిగితే.."

"..అనాధని అవుతానన్నాడు. నాకు తెలుసు ఈజోక్. ఇంకోటి చెప్తాను. ఇది నీకు తెలీకపోవచ్చు. స్టాలిన్ ఓ కార్ల ఫేక్టరీని సందర్శించినప్పుడు కొత్త మోడల్ కారుని వర్కర్స్ ఆయనకి చూపించారు. దానికేం పేరు పెడుతున్నారని అడిగితే మదర్‌లేండ్ అని జవాబు చెప్పారు. ఆయన నిశ్శబ్దంగా సిగార్‌ని తాగుతూ కొద్ది క్షణాలు వాళ్ళవంక చూస్తూంటే అంతా భయంతో వణికిపోయారు. 'మదర్‌లేండ్‌కో ధర పెట్టి అంత చవకగా అమ్ముతారా?' అని ఆయన అడిగితే, ఐతే స్టాలిన్ అనే పేరు పెడతామని వర్కర్స్ చెప్పారు."

చైత్ర, ఆద్య, ఇలియా పకపకా నవ్వారు. ఇలియా తన భర్తతో రష్యన్ భాషలో ఏదో చెప్పి అంతలో చెప్పింది.

"సారీ. ఇది నేను వినని జోకని చెప్తున్నాను."

ఈ రకం సంభాషణ వారం క్రితం దాకా ఆద్యకి పరమ విసుగు. ఇప్పుడామె వాళ్ళ ఉచ్ఛారణని అర్థం చేసుకుంటూ తనకి తెలీని ప్రపంచం గురించి ఆసక్తిగా వింటోంది.

సెర్జీ ఇయర్‌ఫోన్, హెడ్‌ఫోన్‌లతో వచ్చి రష్యన్ భాషలో వాటిలో మైక్రోఫోన్ ఏదని అడిగాడు.

"వీటి మైక్ జాక్‌లని చూడు. దీనికి ఎన్ని స్ట్రిప్స్ ఉన్నాయి?" అలెక్సీ అడిగాడు.

"రెండు" వాడు చెప్పాడు.

"అంటే దీనికి మైక్ లేదని అర్థం. ఇది ఇయర్ ఫోన్ మాత్రమే. దీనికి?"

"మూడు స్ట్రిప్స్ ఉన్నాయి."

"మూడంటే దానికి మైక్ ఉన్నట్లు. దేనికి అదనంగా మైక్ ఉంటే దానికో స్ట్రిప్ ఉందని గుర్తుంచుకో. ఇప్పుడు నేను చెప్పింది అర్థమైందా?"

"ఐంది. టు స్ట్రిప్స్ నో మైక్. త్రి. మైక్ ఉంది" చెప్పి వాడు వెళ్ళిపోయాడు.

"సారీ. పిల్లలు ముఖ్యమైన పనికి అడ్డువచ్చేవారు కారు. వారే ముఖ్యమైన పని" వాడు వెళ్ళాక అలెక్సీ చెప్పాడు.

"ఇట్స్ పర్‌ఫెక్ట్లీ ఆల్‌రైట్" చైత్ర చెప్పింది.

"సెర్జీ పుట్టకుండానే ఓ ప్రాణాన్ని రక్షించాడు తెలుసా?" ఇలియా నవ్వుతూ అడిగింది.

"పుట్టకుండానేనా? అదెలా?" ఆద్య వెంటనే అడిగింది.

"మా నాన్నగారు ఓసారి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నారు."

"ఏమైంది?" ఆద్య అదిరిపడి అడిగింది.

"మా అమ్మ మరణించింది. పిల్లలంతా రెక్కలు వచ్చి వెళ్ళిపోయాం ఇంట్లో ఆయన ఒక్కరే ఉంటున్నారు. ఒంటరితనం భయంకరం. భార్యా వియోగంతో ఆయనకి జీవితం మీద విరక్తి పుట్టింది. పైగా రెండు కిడ్నీలు పాడై ప్రతీ రెండు రోజులకోసారి స్వయంగా డయాలసిస్ చేసుకుంటున్నారు. ఆయన బాత్‌టబ్‌లో మణికట్టు నరం కొసుకుని మరణించాలని అన్నీ సిద్ధం చేసుకున్నారు. ఆ రోజు సరిగ్గా సమయానికి నేను మా నాన్నకి ఫోన్ చేసి గర్భవతినయ్యానని చెప్పాను. తన మనవడ్ని చూసి పోవాలని ఆత్మహత్యని వాయిదా వేసారు. చూసాక ఇక వీడికోసం జీవించాలని అనుకున్నారు. వాడిని మొదటిసారి ఎత్తుకున్నాక ఇది చెప్పారు."

"దట్ రిమైండ్స్ మీ. 'నన్ను పెళ్ళి చేసుకుంటావా?' అని ఇలియా మొదటగా అడిగింది నన్నుకాదు. తన నాన్నని" అలెక్సీ నవ్వుతూ చెప్పాడు.

"వాట్! నాన్ననా?" ఆద్య ఆశ్చర్యంగా అడిగింది.

"ఎన్నో ఏట?" చైత్ర వెంటనే అడిగింది.

"గుడ్ క్వశ్చన్. తన ఆరో ఏట. 'నాన్నా. నేను నీ భుజాలదాకా వచ్చాక నన్ను పెళ్ళి చేసుకుంటావా?' అని తన తండ్రిని అడిగింది."

అంతా గట్టిగా నవ్వారు.

"నాకు మా అమ్మకన్నా మా నాన్నంటేనే ఇష్టం. ఆయనకి ఆరోగ్య సమస్య కాబట్టి వచ్చి మాతో ఉండమన్నాను. కాని పుట్టిన గడ్డమీద మమకారం."

"ప్రతీ మనిషి జీవితంలో ఓసారి అతి లోయెస్ట్ పాయింట్ వస్తుంది. దాన్ని ఆత్మహత్యతో పరిష్కరించకుండా అధిగమిస్తే ఇక మళ్ళీ ఆ ఆలోచన ఎప్పటికీ రాదు. అందుకే ఆ సైన్ బోర్డ్. 'డిలీట్ ఎవ్వరిథింగ్ ఇన్ యువర్ మైండ్ దట్స్ నాట్ మూవింగ్ యు ఫార్వర్డ్' లేకపోతే జీవితంలో నీకు ఆనందం  కనిపించదు" అలెక్సీ సైన్ బోర్డ్ వంక చూస్తూ చెప్పాడు.

"రష్యాలో ఆయిల్ ఇండస్ట్రీ బాగా అభివృద్ధి చెందింది. అలెక్సీ. నువ్వు చాలా తెలివిగలవాడివి .నీ ఫస్ట్ జాబ్ ఇంటర్వ్యూలో ఎలా సెలక్ట్ అయ్యావో మా చెల్లెలికి చెప్పు" చైత్ర కోరింది.

వెంటనే అతని మొహంలో చిరునవ్వు.

"నీకో పది లక్షల డాలర్లు లాటరీలో వచ్చాయనే టెక్స్ట్ మెసేజ్ ఇప్పుడు వస్తే ఈ ఉద్యోగంలో చేరతావా?' అని అడిగారు.

'చేరతాను' అని జవాబు చెప్పాను.

'కారణం? దాంతో నువ్వీ కంపెనీనే కొనగలుగుతావు కదా?' అని అడిగితే

'నేను నా జీవితంలో ఇంతదాకా లాటరీ టిక్కెట్ కొనలేదు. కాబట్టి అది స్కాం మెసేజ్ అవుతుంది' అని చెప్పాను."

"క్వయిట్ ఇంటలిజెంట్ ఆన్సర్" ఆద్య చెప్పింది.

"కారణం నేను ఎస్తోనియాలో బదులు లెనిన్‌గ్రాడ్లో జన్మించడం. అందుకు ఋణపడటానికి నాకు దేవుడు లేడు.

ఇలియా వెంటనే భర్త వీపు మీద మందలింపుగా చరిచింది.

"వారు అడిగిన తర్వాతి ప్రశ్న, 'నీకిచ్చిన కాఫీ కప్పుకి హేండిల్ లెఫ్ట్‌సైడ్ ఉందా? లేక రైట్‌సైడా?' అది ట్రిక్కీ క్వశ్చన్ అని అనిపించింది. అందులో కాఫీ ఎక్కడ ఉందని ఆలోచించాను. దాంతో జవాబు తట్టింది. 'అవుట్‌సైడ్' అని చెప్పాను. 'గుడ్. రేపే పనిలో చేరు ' అని ఆ జవాబుతో తృప్తిపడ్డ ఆ చిన్న కంపెనీ మేనేజర్ చెప్పాడు. అక్కడ పనిచేసిన అనుభవంతో స్క్లంబర్జేకి షిఫ్ట్ అయ్యాను" అలెక్సీ చెప్పాడు.

"నీకు ఇంజనీరింగ్‌లో సీట్ ఎలా వచ్చిందో చెప్పు" ఇలియనా భర్తని కోరింది.

మరోసారి అతని మొహంలో చిరునవ్వు.

"నన్ను నేను పొగుడుకునేలా చేస్తున్నారు. రష్యాలో సెలక్షన్ చిత్రంగా ఉంటుంది. ఎవరు ముందుగా ఆటోగ్రాఫ్ చేసిన కాగితం ఇస్తే వారు గెలిచినట్లు అన్నారు. మా బల్లల ముందు పెన్, కాగితం సిద్ధంగా ఉన్నాయి. నేను ఆయన దగ్గరకి ఉరికి జేబులోంచి రూబుల్ నోట్ తీసి అందులోని ట్రెజరర్ సెక్రటరీ సంతకాన్ని చూపించాను. నా ఆటోగ్రాఫ్ అని ప్రత్యేకంగా అడగలేదు కాబట్టి నన్ను సెలక్ట్ చేసారు."

"యు హేవ్ ఏ బ్రిలియంట్ మైండ్. ఏదో రోజు మన కంపెనీ ప్రెసిడెంట్ అవుతావు" చైత్ర అభినందనగా చెప్పింది.

"అవును. నాది బ్రిలియంట్ మైండే. నేను చెప్పులు, బూట్లు కొన్నప్పుడల్లా సేల్స్‌మేన్‌కి చెప్పి వాటిమీద లెఫ్ట్ రైట్ అని మార్కర్ పెన్‌తో రాయిస్తాను" అతను సీరియస్‌గా చెప్పాడు.

అంతా ఫక్కున నవ్వారు. ఇలియా లోపలికి వెళ్ళి ఐస్‌క్రీం కప్పులతో వచ్చింది. ఐస్‌క్రీం కప్‌తోపాటు పక్కనే వేడి నీళ్ళ బౌల్‌ని ఉంచింది. అదెందుకో అక్కచెల్లెళ్ళు ఇద్దరికీ అర్ధంకాలేదు. ఏంజెలీన చెంచాని వేడినీళ్ళల్లో ముంచి అది వేడెక్కాక దాంతో ఐస్ క్రీంని తిన్నది. అక్కచెల్లెళ్ళు గట్టి ఐస్‌క్రీంలోకి వేడి చెంచా తేలిగ్గా దిగి, తీసుకోవడం తేలికవుతుందని గ్రహించారు.

బయలుదేరేముందు ఆద్య బాత్‌రూంలోకి వెళ్తూంటే, చెల్లెలికి మాత్రమే వినపడేలా చైత్ర హెచ్చరించింది.

"సీట్ డౌన్, లిడ్ అప్ అన్నది గోల్డెన్ రూల్."

బాత్‌రూం దగ్గరకి వెళ్ళే పాసేజ్‌లో ఆద్యకి ఓ పోస్టర్ కనిపించింది. అందులోని కుడివైపు వాడు పెద్దగా వాదిస్తూంటే, ఎదుటివాడు ప్రశాంతంగా నవ్వుతున్నాడు. నవ్వేవాడి మెదడు నిండా పుస్తకాలు. వాదించేవాడి మెదడంతా ఖాళీ. దానికున్న బాణం గుర్తు కిందకి, మనిషి తల ఆకారంలో చేసిన బుక్ షెల్ఫ్ వైపు చూపిస్తోంది. దానిమీద రష్యన్ భాషలో రాసిన పోస్టిట్ అతికించి ఉంది. షెల్ఫ్‌లోని 'లవ్ స్క్వేర్' అనే పుస్తకం కనిపించి ఆద్య దాన్ని ఆసక్తిగా తెరచి చూసింది. అది చారిత్రాత్మక నవలని రెండు పేరాలు చదివాక తెలిసింది. ఓ పేరా ఆమెని బాగా ఆలోచింపచేసింది.

'అరటిపళ్ల వ్యాపారి పగలంతా పళ్ళు అమ్మి, రాత్రి ఇంటికి వెళ్ళేముందు మిగిలిన పళ్ళలోని కుళ్ళినవి, పాడైనవి తీసిపారేసి, నాణ్యమైన వాటిని మాత్రమే మర్నాడు అమ్మడానికి ఉంచుకుంటాడు. ఇలా రోజూ మిగిలిన వాటిలోని చెడిపోయినవి తీసి పారేస్తుంటాడు. ఇలాగే బాధని కలిగించే, ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే జ్ఞాపకాలని నిద్రపోబోయేముందు మనసులోంచి నైపుణ్యంగా తీసేయాలి. ఇలా ఏ రోజు చిట్టాపద్దులని ఆ రోజే పూర్తి చేయాలి. మంచి అనుభూతులని, చక్కటి జ్ఞాపకాలని మాత్రమే ఖాతాలోకి జమ చేయాలి.'

తనా వ్యాపారస్థుడైతే వాటిని ఏరి పారేసి ఉండేది కాదని ఆమెకి అనిపించింది. 'నీ భావోద్వేగాలకి మార్కెట్ లేదు. కాబట్టి వాటిని ఇక్కడ ప్రదర్శించకు ' అన్న జినేంద్ర మెసేజ్ గుర్తుకు వచ్చింది. ఇలియాని అడిగింది.

"ఆ పోస్ట్ ఇట్‌లో ఏం రాసారు? అది ఆసక్తికరమైందని బెట్."

"దాని అర్థం బాల్యంలో పుస్తకాలు చదవని వారంటే నాకు సానుభూతి అని" ఇలియా చెప్పింది.

వాళ్ళకి గుడ్‌నైట్ చెప్పి బయటకి వచ్చారు.

ఇంటి బయట తోటలోని 'గ్లో ఇన్ ది డార్క్' పెయింట్‌తో పెయింట్ చేసిన రాళ్ళు చీకట్లో దారి పక్కన రెండువైపులా మెరుస్తూ కనిపించాయి. తిరిగి ఇంటికి కాలినడకన వెళ్తూ చైత్ర చెల్లెలితో చెప్పింది.

"సాల్ట్ అండ్ పెప్పర్ సెట్‌ని కవలలుగా అనుకుని ఒకటి అడిగినా రెండూ ఇవ్వడం మర్యాద. ఒకదాని పనయ్యాక మళ్ళీ రెండోది కూడా అడగొచ్చు. అందుకే సాల్ట్ అండ్ పెప్పర్ సెట్స్‌ని కౌగిలించుకునే బొమ్మలుగానో, లేక మరో విధంగా సెట్‌గానో చేస్తున్నారు."

"వాళ్ళిద్దరూ ఆసక్తికరమైన మనుషులు" ఆద్య చెప్పింది.

"అక్కడి టాపిక్స్ నీకు విసుగు పుట్టించాయా? ఇలాంటివే మేము మాట్లాడుకునేది."

"లేదు. కొత్త విషయాలు. ఆసక్తిగా ఉన్నాయి."

"అలెక్సీ నా బాస్. ఇండియాలోలా బాస్‌ల్ని సర్ అనడం, వారికి భయపడటం వెస్ట్రన్ సొసైటీలో ఉండదు. కంపెనీ ప్రెసిడెంట్, అతి తక్కువ జీతం తీసుకునే ఆఫీస్ బాయ్ ఒకే బల్లముందు కూర్చుని లంచ్ తీసుకుంటూ, సరదాగా కబుర్లు చెప్పుకుంటారు. అలెక్సీకి తన కుటుంబం తొలి ప్రేమ. తర్వాత తన పని. ఓ రోజు మీటింగ్‌లో మా వైస్ ప్రెసిడెంట్ పాలిష్ చేయని అలెక్సీ బూట్లని చూసాడు. అది ఆయన గమనించాడని తెలిసి దానికి అలెక్సీ చెప్పాడు. 'ఉదయం నేను ఆఫీస్‌కి రాబోయే ముందు డ్రెస్ చేసుకున్నాక సాక్స్ తొడుక్కుని బూట్లని చూస్తే, మెరుపు లేక వాటికి పాలిష్ అవసరం అని నాకు అనిపించింది. నేను పాలిష్ డబ్బాని, బ్రెష్‌ని అందుకోబోతుంటే నా రెండేళ్ళ కొడుకు ఏడుపు వినిపించింది. దానితో నా పనిని వదిలి వెళ్ళి వాడిని ఎత్తుకుని వాడి కన్నీళ్ళని తుడిచి ప్రేమగా ముద్దుపెట్టుకుని ఓదార్చాను. వాడి ఏడుపు మాయమై నవ్వేసరికి నా బూట్లని పాలిష్ చేసుకునే వ్యవధి లేకపోయింది ' వెంటనే వి.పి మొహంలో చిరునవ్వు.

"ఫర్వాలేదు. ఓ రోజు ఈ బూట్లు చెత్తబుట్టలోకి వెళ్ళిపోయాక వాటిని నిత్యం పాలిష్ చేసారా అని ఎవరూ పట్టించుకోరు. కాని ఈ ఉదయం నువ్వు నీ కొడుక్కి ఇచ్చిన ప్రేమ వాడి జ్ఞాపకాల్లో నిలిచే ఉంటుంది. దాన్ని వాడు ముందు తరాలకి పాస్ ఆన్ చేస్తాడు. కాబట్టి నువ్వు బూట్లని పాలిష్ చేయకపోవడం సబబే. నువ్వు చేయాల్సిన పనులని బాధ్యతగా చేస్తున్నావనడానికి ఇదో నిదర్శనం అనిపిస్తోంది. జీవితంలో మనకి ఎవరున్నారు? అన్నది ముఖ్య సంపద.' అని చెప్పాడు."

"టచింగ్!"

"అలెక్సీ చాలా తెలివిగలవాడు. ముసలి గొరిల్లాకి నువ్వు అడవిలోని దారులని నేర్పించక్కర్లేదని కాంగోలిస్ సామెత. యూదులంతా సహజంగా తెలివైనవారు."

ఇంటికి వచ్చి దుస్తులు మార్చుకున్నాక ఆద్య అడిగింది.

"యూదులు ఎవరు? వాళ్ళు ఎందుకు తెలివైనవాళ్ళక్కా?"

"ఇండియానించి అమెరికాకి వెళ్ళినప్పుడు నా కొలీగ్స్‌తో ట్రివియా గేమ్ ఆడేప్పుడు నాకు జీరో మార్కులు వస్తే ఎందుకా అని ఆలోచించాను. గుర్తుందా? మన చిన్నప్పుడు లోకజ్ఞానం కోసం నాన్న మనల్ని దినపత్రిక చదవమనేవారు. కాని ఎంసెట్ పాఠాలు చదివేందుకే టైమ్ లేదు. అవేమీ పెట్టొద్దు' అని అమ్మ అడ్డుపడేది. ఈ రోజుల్లో అసలు పేపరే ఇంటికి వేయించుకోవడంలేదు. మనదేశం నిండా పేపర్ చదవని యువతే. లోకజ్ఞానం చాలా ముఖ్యం". చైత్ర తన మొబైల్లో వెదికి ఓ ఇంగ్లీష్ ఆర్టికల్‌ని బయటికి చదివింది.

"ప్రపంచంలోని ఇంజనీరింగ్, సంగీతం, సైన్స్, ఫిల్మ్ ఇండస్ట్రీ, ఫేషన్, కాస్మెటిక్స్, ఆయుధ, ఆహార వ్యాపారాల్లో డెబ్బై శాతం యూదుల ఆధీనంలోనే ఉన్నాయి. చాలా దేశాల రాజకీయాలని వీళ్ళు ప్రభావితం చేయగలరు. భగవంతుడు వాళ్ళకే ఈ వరాన్ని ఎందుకు ఇచ్చాడు? ఇది వరమా? లేక వాళ్ళు సాధించుకున్నదా? అసలు ఫేక్టరీల్లోని వస్తువుల్లా తెలివైన యూదుల్ని సృష్టించగలరా?

ఇజ్రాయిల్‌లోని రెండు హాస్పిటల్స్‌లో మూడేళ్ళు ఇంటర్న్‌షిప్ చేసిన డాక్టర్ స్టీఫెన్ కార్లియన్ ఈ ప్రశ్నలకి సమాధానం కోసం ఎనిమిదేళ్ళపాటు వారు తినే ఆహారం, సంస్కృతి, గర్భం ధరించాక తీసుకునే జాగ్రత్తలు, పాటించే మతాచారాలు మొదలైనవి అధ్యయనం చేసి, వాటిని ఇతర జాతులతో పోల్చి చూసి ఇలా చెప్పాడు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**
www.anandbooks.com
www.telugubooks.in

Post your comments